పడకేసిన పారిశుధ్యం

- ఏలేశ్వరంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు
- రోగాలకు నిలయంగా నగరపంచాయతీ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఏలేశ్వరం: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది ఏలేశ్వరం నగర పంచాయతీ పరిస్థితి. పేరుకు నగర పంచాయతీ హోదా ఉన్నా అభివృద్ధిలో సున్నా కనిపిస్తోందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పాలకులు తమ సొంత ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ పట్టణ అభివృద్ధిని గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. నిత్యం జనసంచారం ఉండే ప్రాంతాల్లో చెత్త గుట్టలు దర్శనమిస్తున్నాయి. మార్కెట్ యార్డులోని చేపల మార్కెట్, దుకాణాల సముదాయంతో పాటు ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో పాటు పెద్దవీధి, కప్పలచెరువు, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడే వ్యర్థాలు దర్శనమిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు డ్రైన్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పలు ప్రాంతాల్లో డ్రైన్లు పూడికుపోయి మురుగు రహదారులపై పారుతోంది. ప్రస్తుతం వర్షాలకు రోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.


చేపల మార్కెట్‌లో పూడుకుపోయిన డ్రైన్

అధ్వానంగా పారిశుధ్యం

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ పైల సత్యనారాయణ ఆరోపించారు. పట్టణంలోని పలు ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్థానిక మార్కెట్‌లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో చెత్త తొలగించకపోతే ప్రజలు రోగాల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా మార్కెట్‌లో డ్రైన్లు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగర పంచాయతీకి వచ్చే ఆదాయ మార్గాలపై ఉన్న దృష్టి అభివృద్ధిపై లేదని బహిరంగంగా విమర్శిస్తున్నారు. పట్టణ పరిధిలో ఇళ్లనిర్మాణాలు, లే అవుట్లు, పన్నులు, ఇతర ఆదాయ మార్గాలపై పాలకుల దృష్టి సారిస్తున్నారని, ప్రజారోగ్యం అభివృద్ధిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగు పరచడంతో పాటు అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగు పరచాలి



పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలి. డ్రైన్లు పూడుకుపోవడం, అపరిశుభ్రత కారణంగా అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉంది. దీనిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– దాడిశెట్టి వీరబాబు, జైభీమ్ భారత్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏలేశ్వరం

మెరుగుకు చర్యలు



పట్టణంలో పారిశుధ్యం మెరుగు చర్యలు చేపడతాం. చెత్త, వ్యర్థాలను పోగు చేసే కాంపెక్ట్ (వ్యాన్) రిపేర్‌లో ఉంది. కౌన్సిల్ ఆమోదంతో దీనిని రిపేర్ చేయించి అందుబాటులోకి తీసుకువస్తాం. ఉన్న సిబ్బందితో పారిశుధ్యం మెరుగు పరుస్తున్నాం.

– కె.శివప్రసాద్, కమిషనర్, నగర పంచాయతీ ఏలేశ్వరం


మార్కెట్‌లో చెత్తను పరిశీలిస్తున్న మాజీ వైస్ చైర్మన్ సత్యనారాయణ


రహదారి చెంతనే పేరుకుపోయిన వ్యర్థాలు


కూరగాయల దుకాణాల వద్ద మురుగునీరు

క్లుప్తంగా

17న మరిడమ్మతల్లి జాతర


మరిడమ్మ అమ్మవారు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో లక్ష్మీదేవి చెరువుగట్టుపై కొలువైన మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి గురువారం ఉదయం వరకూ జాతర నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలరాతి చక్రరావు, కార్యదర్శి కీర్తి నాగేశ్వరరావు, కోశాధికారి మోకిన సురేష్ తెలిపారు. 18న తీర్థం నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామన్నారు. గ్రామంలో అష్టాదశ (18) శక్తి పీఠాలు ఒకేచోట కొలువైన ఏకైక ఆలయం ఇదే అన్నారు. జాతర, తీర్థం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. అమ్మవారి జాతర, తీర్థంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు హెల్మెట్‌ధారణపై అవగాహన


జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎస్సై బలరాం

జగ్గంపేట: ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని స్థానిక ఇన్‌చార్జి ఎస్సై బలరాం సూచించారు. జగ్గంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు శుక్రవారం హెల్మెట్‌ధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు హెల్మెట్ ధరించిన వారు క్షేమంగా బయటపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. హెల్మెట్ ధరించకపోతే తలకు తీవ్రగాయాలైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాహనచోదకులు బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యాస జయంతి వేడుకలు


ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వ్యాసమహర్షి చిత్రపటానికి పూజలు చేస్తున్న కాలనీవాసులు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వ్యాస జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో వ్యాస మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబా మాట్లాడుతూ వ్యాసమహర్షి లోక కల్యాణం, లోక శాంతి కోసం అనంతమైన వాఙ్మయం మానవాళికి అందించారన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు అక్షింతల రాజా, ప్రధాన కార్యదర్శి దోనపాటి సుబ్బారావు, సభ్యులు వలసాల చెన్నారావు, కామిశెట్టి నాగేశ్వరరావు, అడబాల నూకరాజు, సిద్ధా సాయి, పెదిరెడ్ల సత్యనారాయణ, కరిబండి రామకృష్ణ, నందూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

కిర్లంపూడి: ఎన్డీయే కూటమి సమష్టి కృషితో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిందని బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు అన్నారు. మండలంలోని జగపతినగరం రామాలయం వద్ద శుక్రవారం బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట వెంకట సర్వరాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ విధివిధానాలపై ప్రసంగించారు. అనంతరం రామాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మట్ట మంగరాజు, దాట్ల కృష్ణవర్మ, సింగిలి దేవి సత్తిరాజు, చిత్రా పాపారావు పాల్గొన్నారు.

‘పీఎంఎంవీవై’ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు: ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకాన్ని (పీఎంఎంవీవై) సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ పి.అరుణ సూచించారు. మండలంలోని టి.రాయవరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకం ద్వారా గర్భిణులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్, నవజాత శిశువుల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు అనిత, ఏఎన్ఎం ఎ.అనంతలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు ఎంపీ పద్మావతి, ఐ.వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ యోజన వివరాలు సరిచూసుకోవాలి

గోకవరం: రైతులు ప్రధానమంత్రి కిసాన్ యోజన వివరాలను సచివాలయాల్లో సరిచూసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి శుక్రవారం సూచించారు. 18వ విడత పీఎం కిసాన్ నగదు రూ.2 వేలు ఈ నెల 31న రైతుల ఖాతాల్లో జమ కానున్న నేపథ్యంలో 2019 జనవరి 31వ తేదీ నాటికి భూమి ఆన్‌లైన్‌లో నమోదై పట్టా పొందిన రైతులకు మాత్రమే అర్హత ఉందన్నారు. రైతులు ఈ-కేవైసీ, లాండ్ సీలింగ్, ఆధార్ వంటి వివరాలను సరిచూసుకోవాలన్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాగు చేసుకునే కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌలురైతులు ఆధార్‌కార్డు, భూ యజమాని పట్టా పాస్‌పుస్తకం తీసుకుని వీఆర్వోలను సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

తలుపులమ్మతల్లికి రేపు లక్ష కుంకుమార్చన


తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: ఆషాఢమాసంలో రెండో ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న లోవ దేవస్థానంలో తలుపులమ్మతల్లికి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు కుంకుమార్చన ప్రారంభమవుతుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలన్నారు. సోమవారం అమ్మవారి జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకుని తలుపులమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


పి.చందు


యశస్వి


శ్రావణి


అపురూప రమ్య


సునంద్

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన పెద్దాడ చందు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజు శుక్రవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 565 మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన చందు శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు చెప్పారు. పీయూసీ, ఇంజినీరింగ్ చదువుకునే అవకాశం దక్కిందన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి చందును హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు ఎంపిక

తుని రూరల్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీకి తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు హంసవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పల్లా పద్మజ శుక్రవారం తెలిపారు. పదో తరగతిలో 571 మార్కులు సాధించిన యశస్వి, 564 మార్కులు సాధించిన శ్రావణి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం టీవీఎస్ రంగారావు తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన బాకూరి జ్యోతిక అపురూపరమ్య, డి.సునంద్ ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వీహెచ్‌పీ ప్రఖండ నూతన కమిటీ ఎన్నిక


విశ్వహిందూ పరిషత్ ప్రఖండ నూతన కమిటీ సభ్యులు

గోకవరం: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)గోకవరం ప్రఖండ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం స్థానిక దాసరి వారి రామాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విభాగ్ సంఘటన కార్యదర్శి చిక్కం నారాయణ ఆధ్వర్యంలో గోకవరం ప్రఖండ కమిటీని ప్రకటించారు. ప్రఖండ అధ్యక్షుడిగా దాసరి ధర్మరాజు, ఉపాధ్యక్షులుగా చల్లా రాజ్యలక్ష్మి, సూరపురెడ్డి వెంకటరమణ, కార్యదర్శిగా మారిసీడి రంగబాబు, సహ కార్యదర్శిగా గంగ్రెడ్డి సన్యాసిరావు, పడాల భూషణం, కోశాధికారిగా బత్తుల వెంకన్నబాబు, సేవా ప్రముఖ్‌గా పంతం సత్తిబాబు తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల అదివిష్ణు, ధర్మప్రచార ప్రముఖ కొత్తపల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు సత్తి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం


వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు


ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు, హిందూ పరిషత్ సభ్యులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, అర్చకులు కోట వంశీ, పరిచారకులు ఫణిశర్మ, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయి రామ్ ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఘనంగా భగవద్గీత, లలితా సహస్రనామ పారాయణలు

ఏలేశ్వరం: వారాహి అమ్మవారి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా షష్ఠిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో మహిళలు పలు పారాయణలు చేశారు. స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో మహిళలు లలితా సహస్రనామాలు, శివపంచాక్షరి, భగవద్గీత, భజన కాలక్షేపం నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు ఉడతల రమణారావు, మజ్జి సత్యనారాయణ, మల్లేశ్వరి, కుమారి, ఇందిరా, సూర్యకుమారి, శారద, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ రమణ

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ డీడీ రమణ సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను శుక్రవారం జీసీడీఓ ఉమా మహేశ్వరితో కలిసి ఆయన సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంట గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులను పోటీ ప్రపంచానికి దీటుగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలా కుమారి పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

ఏలేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమత్తుల కారణంగా ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సి.రాయవరం, రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, జె.అన్నవరం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరాఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తొండంగి: మండలంలోని ఏవీ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని ఏవీ నగరం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, కోదాడ ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గోకవరం: విద్యుత్ సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మత్తుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోకవరం, రాజుపాలెం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, కృష్ణునిపాలెం, కొత్తూరు, రామన్నపాలెం, వెంకటాపురం, వీర్లంకపల్లి, పెంటపల్లి, రంపయర్రంపాలెం గ్రామాలకు, సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ బోర్లకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కిర్లంపూడి: మండలంలోని కృష్ణవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమతుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఏఈ కె.రత్నాలరావు శుక్రవారం తెలిపారు. కృష్ణవరం, సోమవరం, బూరుగుపూడి, సోమరాయణంపేట, పాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఉండదన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


గండేపల్లి: మండలంలోని యర్రపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. పని కొలతలు, కూలీల వేతనాలు, మస్తర్లు, హాజరుశాతాన్ని పరిశీలించి ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎన్. గంగాభవాని, టీఏలు, సీఓలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సీజనల్ వ్యాధుల అవగాహన కల్పిస్తున్న అధికారులు

తొండంగి: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం వైద్యారోగ్యశాఖ, ఐకేపీ సంయుక్త ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు సీజనల్‌వ్యాధులు, నీరు, ఆహారం కలుషితం వల్ల వచ్చే డయేరియా, దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వై.సత్తిబాబు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది జి.సత్యనారాయణ, పీవీ సూర్యనారాయణ, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సిరిధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలి


శిక్షణలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కిర్లంపూడి: సిరిధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ వ్యవసాయ సంయుక్త సహాయకులు ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిరిధాన్యాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. సమీకృత వ్యవసాయ విధానం వల్ల తక్కువ స్థలంలో ఎక్కువ పంటలు పండించడం ద్వారా అధిక దిగుబడులు పొందువచ్చన్నారు. అర్హులందరికీ కౌలుకార్డులు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఏ హరి, ఏడీఏ దైవకుమార్, ఏఓ జోకాఅమృత తదితరులు పాల్గొన్నారు.

పొలంబడిపై అవగాహన

గండేపల్లి: స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి ఆధ్వర్యంలో పొలంబడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరప నేలలు, మూడేళ్లలోపు పామాయిల్ తోటల్లో రాగులు, చిరుధాన్యాలు, అంతర పంటలు సాగుచేసి అధిక ఫలసాయం పొందాలని రైతులకు సూచించారు. రైతులకు 50 శాతం రాయితీపై ప్రభుత్వం విత్తనాలు అందజేస్తున్నట్టు తెలిపారు.